సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 18 । మే । 2025



సోమశిలలో 46.777 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 46.777 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 4,300, ఉత్తర దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.96,230
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,720
3శాతం జీఎస్టీతో	రూ.8,982
నవర (8గ్రా)	రూ.71,856

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.6 /29.5

జిల్లాలో ఆదివారం అక్కడక్కడ చిరుజల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

• భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది, బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటల పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణం శాస్త్రోక్తంగా చేపట్టారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామి అమ్మవార్లను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మైనింగ్ కేసులో విచారణకు హాజరు

నెల్లూరు (క్రైమ్): రుస్తుం మైనింగ్ కేసులో విచారణ నిమిత్తం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, విరువూరు నేత బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి శనివారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో హాజరయ్యారు. డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో ఆయన వచ్చిన తర్వాత మరోమారు పిలుస్తామని కార్యాలయ సిబ్బంది వెంకట శేషయ్య, సురేష్‌కుమార్‌రెడ్డిలకు తెలియజేయడంతో వారు వెనుదిరిగారు.

ఉరుములు మెరుపులతో వర్షం



ఉదయగిరి రూరల్: ఉదయగిరితోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతకు ప్రజలు తల్లడిల్లిపోయారు. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. మేఘాలు ఉదయగిరి దుర్గాన్ని కమ్మేశాయి. ఆ దృశ్యాన్ని పలువురు ఆస్వాదించారు. రోడ్లపై వర్షపు నీరు మురుగునీరు ఏకమై ప్రవహించడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

కూటమి ప్రభుత్వానికి మా బాధలు పట్టవా?

నెల్లూరు (అర్బన్): ఇరవై రోజులుగా సమ్మె చేస్తూ తమ సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నా.. కూటమి ప్రభుత్వం తమ బాధలు పట్టించుకోకపోవడం దారుణమని సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన దీక్షల్లో శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగులను నెత్తిన పెట్టుకుంటామని మాట్లాడిన అధికార పార్టీ నాయకులు అధికారంలోకి వచ్చాక కనీసం తమ బాధలు చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కో ఆర్డినేటర్ ఆదిల్, కార్యదర్శి రుబికా, చంద్రకళ, స్వాతి, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఫుడ్.. నాట్ గుడ్

ఉరుకుల పరుగుల జీవనయానంలో ప్రజల జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి. ఆహారపు అలవాట్లు కూడా చాలా వరకు మారిపోయాయి. సామాజిక స్థాయిలు మారాయి. నగరాలు, పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా కిట్టీ పార్టీ కల్చర్ వచ్చింది. బర్త్‌డేలు, మ్యారేజ్ డేలు, నిశ్చితార్థాలు, ఉద్యోగంలో ప్రమోషన్లు.. సందర్భం ఏదైనా స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులతో కలిసి హోటళ్లల్లో సెలబ్రేట్ చేసుకుంటున్నారు. అయితే ఆ ఆహారమే అనారోగ్యమని గుర్తించలేపోతున్నారు.

అయినా ఇంటి వంటల కంటే హోటల్ ఫుడ్‌కే జనం ప్రాధాన్యం

- అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ
- రంగు, రుచి కోసం ప్రమాదకర రసాయనాల వాడకం
- పుట్టుకొస్తున్న కొత్త రోగాలు
- అధికారుల తనిఖీలు నామమాత్రం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మురికి కాలువ గట్ల మీద ఉండే చిన్నపాటి తినుబండారాల తోపుడుబండి నుంచి పెద్దపెద్ద భవనాల్లో ఉండే ఖరీదైన హోటళ్ల వరకు అన్ని వేళలా ఆహార ప్రియులతో కిటకిటలాడుతుంటాయి. శుభకార్యాల నుంచి అశుభకార్యాల వరకు అన్ని సందర్భాల్లోనూ వడ్డించే ఫుడ్ కోసం హోటల్స్‌కు ఆర్డర్లు ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు బాగా ప్రాధాన్యత పెరిగింది. అయితే ఇక్కడ తయారయ్యే ఆహారాలు, నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసినవి కావడంతో ఆ వంటకాలు తిని పలువురు రోగాల బారిన పడుతున్నారు. క్యాన్సర్ రోగుల్లో 53 శాతం మంది హోటల్స్ ఆహారంతోనే సమస్య తెచ్చుకుంటున్నారని పలు సర్వేలు వెల్లడించడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఆహారాల్లో ప్రమాదకర రసాయనాలు

హోటళ్లల్లో ఆహారాలు కలర్ ఫుల్, రుచికరంగా ఉండేందుకు ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తుండడంతో అనేక రోగాలకు కారణమవుతున్నాయి.

- మెటానియల్ ఎల్లో వాడకం నిషేధించినప్పటికీ చాలా హోటళ్లలో వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యంపై వెంటనే దుష్ప్రభావం చూపించదు. నెమ్మదిగా క్యాన్సర్‌కు కారకమవుతోంది. చిన్నారుల్లో నిద్రలేమి, నరాల సంబంధిత వ్యాధులకు దారితీస్తాయి.
- వంటకాల్లో రంగు కోసం వాడే నిషేధిత టార్ట్రాజిన్ చాలా ప్రమాదకరం. దీంతో మానసిక వ్యాధితోపాటు థైరాయిడ్, క్యాన్సర్, ఎలర్జీ, దద్దుర్లు, తామర, రక్తకణ జాలంలో హానికర కణ జాలల వృద్ధి చెందడం, డీఎన్‌ఏ నష్టపోవడం, నిద్రలేమి, నీరసం వస్తాయి.
- స్వీట్లు, బిస్కెట్లలో ఆరెంజ్ రంగు కోసం వాడే సన్‌సెటన్, పసుపు రంగు కోసం వాడే కాటారజ్, గ్రీన్ కలర్ కోసం వాడే బ్రిలియంట్ బ్లూ, టార్జాజీన్‌లు ప్రమాదకరమే.
- చాకెట్లలో వాడే రోడ్‌మన్–బీ కూడా ప్రాణాంతకమే. అయినా చాక్లెట్లు, చిన్న పిల్లలు తినే రంగుల ఆహార పదార్థాల్లో వీటిని వినియోగిస్తున్నారు.
- రెస్టారెంట్లు బేకరీ ఆహారాలను వరుసగా 40 రోజులు తింటే కీళ్ల నొప్పులు, జీర్ణ సంబంధిత వ్యాధులు వస్తాయి. మరింత అధికమైతే క్యాన్సర్ బారిన పడే ప్రమాదముంది.

పార్టీ కల్చర్.. ప్రమాదకరం

కొన్నేళ్ల క్రితం వరకు పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లినా.. సమయానికి ఇంటికి రాలేని పరిస్థితుల్లో కొందరు హోటళ్లలో తినేవారు. కొందరైతే ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేసేవారు. ఇప్పుడు కల్చర్ మారింది. సామాజిక నడతలో మార్పు వచ్చింది. నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కల్చర్ వచ్చింది. సందర్భం ఏదైనా కిట్టీపార్టీలు చేసుకోవడం అలవాటుగా మారింది. నలుగురు స్నేహితులు కలిస్తేనే కాదు.. వీకెండ్ ఫ్యామిలీస్‌తో కలిసి లంచ్, డిన్నర్ బయటే చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రహించలేకపోతున్నారు. నిల్వ ఉంచిన ఆహారం, ప్రమాదకర రసాయనాలు కలిపిన ఆహారాలతో అప్పటికప్పుడు నష్టం లేకపోయినా దీర్ఘకాలంలో ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.

నాసిరకం.. రంగుల మయం



హోటళ్లల్లో తయారయ్యే ఆహార పదార్థాలు నాసిరకం.. రంగుల మయంగా ఉంటాయి.

- పశువుల ఎముకలను సేకరించి వాటిని బట్టీలో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీస్తున్నారు. ఆ ద్రావణాన్ని సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీని వల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరిలో ఆకట్టుకునేందుకు ఎక్కువగా హానికరమైన రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలతోపాటు అనారోగ్యానికి గురైన వాటిని వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.
- నిషేధిత క్యాట్ ఫిష్‌లను సైతం కొర్రమీనుగా విక్రయిస్తున్నారు. జిల్లాలో వీటిని చికెన్, మటన్ వ్యర్థాలతో గుంతల్లో పెంచుతున్నారు.
- మిరప కాయల్లో ఎరుపు రంగు రావడానికి సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలో వాడిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వినియోగిస్తున్నారు. దీని వల్ల క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదమున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
- చిన్న చిన్న హోటళ్లు, కర్రీస్ పాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి వాటిని తినే వారికి అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులను సైతం కల్తీ చేస్తున్నారు. వీటి ధర ఎక్కువగా ఉండడంతో అందులో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్టును కలుపుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

జిల్లాలో చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్లు, దాబాలు, చాట్ బండార్‌లు, నూడిల్స్ షాపులు, అన్ని కలుపుకుని 5 వేలకు పైగా ఉంటాయి. ఒక్క నగరంలోనే 3 వందల వరకు హోటల్స్ ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటల్స్ యజమానులు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితోపాటు ఓ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు నెలకు 12 శాంపిల్స్ సేకరించాలి. శాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత అవి ప్రమాణాల మేరకు లేకపోతే కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. కానీ ఇవి జరగడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని తమ వద్దకు ఎవరూ రారన్న ధీమాతో వ్యాపారులు చెలరేగిపోతున్నారు. విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు.

నిత్యం తనిఖీలు చేస్తున్నాం



హోటల్స్, ఐస్‌క్రీం పార్లర్‌లు, రెస్టారెంట్‌లు, పండ్ల దుకాణాలను నిత్యం తనిఖీలు చేస్తూనే ఉన్నాం. పలు హోటళ్లలో వంటల తయారీకి ఉపయోగిస్తున్న పదార్థాల్లో నాణ్యత లేకపోగా చాలా వరకు కాలం చెల్లినవి, పాడైపోయినవి ఉంటున్నాయి. 2024–25లో పలు హోటల్స్‌ను తనిఖీ చేసి 296 శ్యాంపిల్స్‌ను సేకరించగా 20 శాంపిల్స్‌లో నాణ్యత తక్కువగా ఉన్నట్లు, 18 శాంపిల్స్ ప్యాకెట్స్‌పై సరైన వివరాలు లేకుండా ఉండటం గుర్తించాం. మరో 15 శాంపిల్స్‌లో ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలు కలిపినట్లుగా గుర్తించాం. 12 కేసులు నమోదు చేయగా, జాయింట్ కలెక్టర్ విచారించి రూ.1.45 లక్షలు జరిమానా విధించాం.

– వెంకటేశ్వరరావు, జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్

కఠిన చర్యలు తీసుకోవాలి



జిల్లాలో కల్తీ ఆహారం రాజ్యమేలుతోంది. రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, భోజన హోటళ్ల యజమానులు ఇష్టానుసారంగా నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తూ ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. నిల్వ ఉంచిన ఆహారాలను విక్రయిస్తూ ప్రజారోగ్యంపై దెబ్బ తీస్తున్న విక్రయదారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– రమణారెడ్డి, నగర వాసి

కల్తీ వల్ల ఆరోగ్య సమస్యలు



కల్తీ ఆహారం తినడం వల్ల జీర్ణకోశ సమస్యలు తలెత్తుతాయి. అవసరమైన పదార్థాలు అందక శరీరం బలహీనమవుతుంది. పోషకాహారం తీసుకుంటున్నామని ప్రజలు భావిస్తున్నప్పటికీ, కల్తీ వల్ల జీవ నక్రియలు నిలిచిపోయి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీలైనంత వరకు బయట ఫుడ్‌కు స్వస్తి చెప్పి ఇంటి ఆహారాన్ని తీసుకోవడం శ్రేయస్కరం. ఆరోగ్యానికి ఎంతో మంచిది.

– డాక్టర్ ఎంవీ రమణయ్య, రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల

ప్రతిష్టాత్మకంగా 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'

• కలెక్టర్ ఆనంద్



మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు (బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మూడో శనివారం చేపడుతున్న స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ సంరక్షణ కోసం మొక్కల పెంపకం ఆవశ్యకతను గుర్తించాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని డివిజన్ల పరిధిలో శనివారం 'బీట్ ది హీట్' అంశంపై పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా మొక్కలను నాటి సంరక్షించే చర్యలను చేపట్టారు. స్థానిక 27వ డివిజన్ రిత్విక్ ఎన్‌క్లేవ్ పార్కులో కలెక్టర్ ఆనంద్, కమిషనర్ నందన్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తమ మాతృమూర్తుల పేరిట మొక్కలను నాటారు. అనంతరం కలెక్టర్ అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని సూచించారు. స్వయం సహాయక బృందాలు పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ హితమైన వస్తువుల ఉత్పత్తి, వినియోగంపై మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళలందరూ గృహాలపైన చిన్నచిన్న మొక్కలతో రూఫ్ టాప్ గార్డెన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నగర వ్యాప్తంగా పచ్చదనాన్ని పరిరక్షించేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోని 64 పార్కుల్లో వాకర్స్ అసోసియేషన్ భాగస్వామ్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ చేపడుతున్నామని కమిషనర్ నందన్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మురహరి, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, టౌన్ ప్లానింగ్ సీపీ హిమబిందు, ఉద్యాన శాఖ ఏడీ ప్రదీప్‌కుమార్, స్థానిక పర్యావరణవేత్త షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పరాకాష్టకు చేరిన కూటమి దుర్మార్గం

- రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అక్రమ అరెస్టలతో ప్రజాస్వామ్యం ఖూనీ
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వ దుర్మార్గాలు పరాకాష్టకు చేరాయని, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అక్రమ అరెస్టలతో ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి దుయ్యబట్టారు. నెల్లూరులో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజాపాలన, అభివృద్ధి పనులను గాలికి వదిలేసి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. దాదాపు 11 నెలల పాలనలో ప్రజలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎవరు కూడా కూటమి ప్రభుత్వ విధానాలపై సంతృప్తిగా లేరన్నారు. ఎక్కడా అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. ఒక్క ఏడాదిలోనే రూ.1.10 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఇలా అప్పు చేసిన సొమ్మునంతా కాంట్రాక్టర్లతో దొంగ బిల్లులు పెట్టించి కమీషన్లు దండుకుంటుందని ఆరోపించారు. రాష్ట్రం అప్పుల ఊబిలోకి కూరుకుపోతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం, వారిపై దౌర్జన్యాలకు దిగడం పరిపాటిగా మారిందన్నారు.

పారదర్శక పాలనపై ఆరోపణలు

గత ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా జరిగిన లిక్కర్ అమ్మకాలను తప్పు పడుతూ స్కామ్ అంటూ ఎవరో ఒకరితో అబద్ధపు స్టేట్‌మెంట్ ఇప్పించి వాటి ఆధారంగా సీనియర్ ఐఏఎస్ అధికారిగా వ్యవహరించిన ధనుంజయరెడ్డి, గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓఎస్డీగా వ్యవహరించిన కృష్ణమోహన్‌రెడ్డిలను అక్రమంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం అత్యంత దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లిక్కర్ అమ్మకాల విషయంలో ప్రతి బాటిల్ స్కాన్ చేసి అత్యంత పారదర్శకంగా ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేరేలా అమ్మకాలు జరిగాయన్నారు. అంతకు ముందుకు, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో వీధికో బెల్టు షాపు, మద్యం షాపులు వద్ద పర్మిట్ రూంలు ఏర్పాటు చేసి 24 గంటలు మద్యం అమ్మకాలు సాగించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేసి ప్రభుత్వ మద్యం దుకాణాలను తీసుకొచ్చి నిర్దిష్ట సమయం ప్రకారమే మద్యం అమ్మకాలు సాగించామని గుర్తు చేశారు. ఇలా అత్యంత పారదర్శకంగా మద్యం అమ్మకాలను గత ప్రభుత్వం సాగిస్తే ఈ రోజు దానికి మద్యం స్కాం అని పేరు పెట్టడం దుర్మార్గమన్నారు.

క్లుప్తంగా

చేపల వేటగాళ్ల పట్టివేత



సోమశిల: సోమశిల జలాశయ వెనుక భాగంలో లైసెన్స్ లేకుండా చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులను జిల్లా మత్స్యశాఖ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. జలాశయంలో చేపల వేటపై నిషేధం ఉన్నా, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వేట సాగించి వస్తుండగా మత్స్యశాఖ సంచాలకుడు శ్రీనివాసులు, వారి సిబ్బంది అదుపులోకి తీసుకొని చేపలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని అధికారుల సమక్షంలో వేలం వేయగా, రూ.5500కు స్థానిక వ్యాపారులు దక్కించుకున్నారు. జలాశయంలో అనుమతుల్లేకుండా వేట సాగిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సోమశిల మత్స్యశాఖ అధికారి సురేష్, సహాయకుడు గోపీచంద్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ప్రథమ సంవత్సర పరీక్షలకు 8681 మందికి గానూ 7965 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సర పరీక్షలకు 1085 మందికి గానూ 63 మంది గైర్హాజరయ్యారు.

రైలు కిందపడి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): దానాపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేదాయపాళెం – నెల్లూరు రైల్వే స్టేషన్ల మధ్యలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడు సుమారు 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి.. స్కై బ్లూ రంగు వైట్ చెక్స్ గల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, గ్రే రంగు ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. దీంతో జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారానికి 43.60 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగకు 1490, పిన్నేరుకు 20, లోలెవల్‌కు 60, హైలెవల్‌కు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

రేపటిలోపు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఏపీసీ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 26 నాటికి 55 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను సోమవారంలోపు అందజేయాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 135
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 268
లేయర్ చికెన్ : 187



పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి : రూ.85
సన్నవి : రూ.45
పండ్లు : రూ.25



పెద్దాస్పత్రిపై విజిలెన్స్

- ఏజెన్సీ మోసాలపై ఆరా
- జీతాల్లో కోత విధిస్తున్నారంటూ ఫిర్యాదులు



నెల్లూరు(అర్బన్): నగరంలోని సర్వజన ఆస్పత్రిలో పారిశుధ్య విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, కార్మికులను దోచుకుంటున్న తీరుపై విజిలెన్స్ అధికారులు శనివారం ఆరాతీశారని విశ్వసనీయ సమాచారం. ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి కార్మిక చట్టాన్ని వర్తింపజేయకపోవడం, జీతాల్లో కోత విధించడం, డబ్బులు తీసుకొని ఉద్యోగాలివ్వడం, కొన్ని నెలల పాటు జీతాలు చెల్లించని అంశాలపై సాక్షిలో కథనాలు ప్రచురితం కావడంతో ఇంటెలిజెన్స్ అధికారులు రహస్యంగా సమాచారం సేకరిస్తున్నారు. నివేదికలనూ సిద్ధం చేస్తున్నారు.

బాధను వెళ్లగక్కి..

తమను ఎలా ఇబ్బంది పెడుతున్నారనే అంశాలను వివరించేందుకు ఒక్కొక్కరూ ముందుకొచ్చారు. యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌ను కలిసి తమ బాధలను చెప్పుకొన్నారు. తమను ఉద్యోగం నుంచి తీసేస్తారనే భయంతో ఇంతకాలం నోరు విప్పలేదని తెలిపారు.

రూ.35 వేల లంచమిచ్చి పనిలో చేరా..



రత్నకుమారి

రెండేళ్ల క్రితం రూ.35 వేల లంచమిస్తే పనిలో పెట్టుకున్నారని పారిశుధ్య కార్మికురాలు రత్నకుమారి చెప్పారు. మేనేజర్ ముందు ఓ మహిళా సూపర్‌వైజర్ చేతికిచ్చానని, ఆపై నాలుగు నెలల పాటు ఉచితంగా పనిచేయించుకున్నారని తెలిపారు. జీతంపై ప్రశ్నిస్తే మెడికల్ కళాశాల నుంచి కష్టంగా ఉండే వార్డుకు మార్చారని వివరించారు. తర్వాత ఇస్తున్నా, అప్పుడప్పుడూ కొంత మినహాయిస్తున్నారని ఆరోపించారు. తాజాగా మార్చి, ఏప్రిల్‌కు కలిపి రూ.26 వేల వరకు జీతం రావాల్సి ఉండగా, రూ.19,800నే ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరు రోడ్డుకు చెందిన తన స్నేహితురాలు శైలను పనిలో తొమ్మిది నెలల క్రితం చేర్పించానని, ఆమె నుంచి సైతం రూ.35 వేల లంచాన్ని వసూలు చేశారని తెలిపారు. ఆమెకూ మొదటి మూడు నెలలు జీతమివ్వలేదన్నారు. యూనిఫారాన్ని ఏజెన్సీ ఇవ్వాల్సి ఉండగా, తమ వద్ద నుంచి రూ.రెండు వేల చొప్పున వసూలు చేశారని తెలిపారు.

కొద్ది రోజులకే జీతాన్ని తగ్గించారు



బిడ్డకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో నారాయణ ఆస్పత్రిలో ఐసీయూలో వైద్యం చేయించుకుంటూ మార్చిలో ఆరు రోజులే పనిచేశా. ఆ నెల్లో చేసిన పనిదినాలకు గానూ రూ.1350 రావాల్సి ఉండగా, రూ.800నే ఖాతాలో జమ చేశారు. ఏప్రిల్‌లో 13 రోజులు పని చేస్తే, రూ.5850 జీతానికి గానూ రూ.రెండు వేలనే ఇచ్చి నా కష్టాన్ని దోచుకున్నారు.

– కామేశ్వరమ్మ, పారిశుధ్య కార్మికురాలు

సెలవు పెట్టకపోయినా.. కోత విధించారు



ఏడాదికి ఒకటో.. రెండో సెలవులే పెడతా. పూర్తిగా పని చేసినా, మార్చిలో రూ.తొమ్మిది వేలు, ఏప్రిల్‌లో రూ.పది వేలనే జమ చేశారు. మిగిలిన మొత్తాన్ని ఏజెన్సీ మేనేజర్ మింగేశారు. ఇంత జరుగుతున్నా, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ పట్టించుకోవడంలేదు.

– లతమ్మ, కార్మికురాలు



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

రాబోయేది జగనన్న ప్రభుత్వమే

- మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో జగనన్న ప్రభుత్వం కొలువుదీరడం ఖాయమని మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. పహల్గామ్‌లో పర్యాటకులను పొట్టనబెట్టుకున్న పాకిస్థాన్ ఉగ్రవాదులపై మన దేశ ఆర్మీ దాడులు జరిపి వారిని మట్టుబెట్టిందని చెప్పారు. ఉగ్రదాడుల్లో మరణించిన సైనికుల కుటుంబాలకు ప్రభుత్వాలు రూ.ఐదు కోట్లనైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసువులుబాసిన సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్‌కు రూ.25 లక్షలను తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అంశాన్ని గుర్తుచేశారు. ప్రపంచంలో పాకిస్థాన్ అనేదే లేకుండా చేయగల సత్తా మనకు ఉందని చెప్పారు. దేశానికి ప్రధానిగా మోదీ.. రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి 20 ఏళ్లు ఉండాలని కాంక్షించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల కన్వీనర్లు అనూప్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, షాహుల్, నవీన్‌కుమార్‌రెడ్డి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

నెల్లూరు(అర్బన్): వెంకటాచలం మండలంలో గతంలో హౌసింగ్ ఏఈగా పనిచేసి అల్లూరు మండలంలో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లును కలెక్టర్ ఆనంద్ శనివారం సస్పెండ్ చేశారు. అదే మండలంలోని వడ్డిపాళెం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరేష్ చక్రవర్తిపై సస్పెన్షన్ వేటేశారు.

స్వాహా పర్వం..

వడ్డిపాళెంలో ఎక్కువ మంది గిరిజనులు తమకు ఇళ్లు మంజూరైనా, బేస్‌మెంట్లు వేసుకొని ఆర్థిక ఇబ్బందులతో నిర్మించుకోలేకపోయారు. ఇదే అదనుగా భావించిన వెంకటేశ్వర్లు, అక్కడి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో కుమ్మక్కయ్యారు. పాత ఇళ్లను కొత్తవిగా చూపి ఆన్‌లైన్లో వివరాలను నమోదు చేసి బిల్లులు మంజూరు చేయించుకున్నారు. జగనన్న కాలనీల్లో అసలు లబ్ధిదారులకు తెలియకుండా వారి పేర్లతో సిమెంట్, ఇనుము లాంటివి స్వాహా చేశారు. బీసీ వర్గానికి చెందిన నవీన్‌కుమార్‌కు 15 ఏళ్లుగా ఇల్లు ఉంది. అయితే అదే ఇంటిని హౌసింగ్ పథకంలో మంజూరు చేసి డబ్బులు డ్రా చేశారు. తురకా రాగమ్మ.. ఇలా అనేక మంది పేర్లతో కొత్త ఇళ్లు మంజూరు చేసినట్లు చూపి పాత వాటికే బిల్లులు డ్రా చేశారు.

దొంగ సంతకాలతో దిగమింగి

దొంగ సంతకాలను కొందరు పెట్టి ముందస్తు వాటాలేసుకొని ప్రభుత్వ సొమ్మును బిల్లుల రూపంలో దిగమింగారు. ఇలాంటి అవకతవకలు మరికొన్ని గ్రామాల్లో జరిగాయి. ఈ అంశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి.విచారణాధికారిగా నియమితులైన నెల్లూరు డివిజన్ ఈఈ మోహన్‌రావు వీటిని పరిశీలించారు. అధికారులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేశారంటూ నివేదిక ఇచ్చారు. దీంతో వీరిని సస్పెండ్ చేశారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న దశరథరామారావు

నెల్లూరు(క్రైమ్): రైలు దిగి నడుచుకొని వెళ్తున్న వ్యక్తిని చంపుతామని కత్తితో బెదిరించి నగదును దోచుకెళ్లిన ఘటనలో నిందితులను సంతపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు వెల్లడించారు. సంగం మండలం మర్రిపాడుకు చెందిన వీరరాఘవయ్య హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెల వద్దకు ఇటీవల వెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 14న తెల్లవారుజామున రైల్లో నెల్లూరు చేరుకున్నారు. ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సెక్కేందుకు గానూ నడుచుకుంటూ వెళ్తున్న ఆయన్ను సింహపురి హోటల్ సమీపంలో గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు రెండు బైకుల్లో వచ్చి అడ్డుకున్నారు. చంపుతామని కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ వెయ్యి నగదును దోచుకెళ్లారు. ఈ మేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఎస్సై బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా ఓల్డ్ చెక్‌పోస్ట్‌కు చెందిన నవాజ్, నెల్లూరు రూరల్ మండలం నవలాకులతోటకు చెందిన షాహుల్, జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన అబ్దుల్ అజీస్ అలియాస్ అబ్దుల్ అజీజ్, నవాబుపేటలోని ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన భాస్కర్, మరో ఇద్దరు బాలలను నిందితులుగా గుర్తించారు. వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ తరుణంలో నిందితులను సింహపురి బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో అరెస్ట్ చేశారు.

నాణ్యమైన వైద్యమందేలా కృషి

- కలెక్టర్ ఆనంద్
- పెద్దాస్పత్రిలో ఫిజియోథెరపీ విభాగ ప్రారంభం



ఫిజియోథెరపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఆనంద్ తదితరులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు డాక్టర్లు, సిబ్బంది కృషి చేయాలని, దీనికి తన వంతు సహాయ, సహకారాలను అందిస్తానని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఆస్పత్రి నిధులతో పాటు దాతల సహకారంతో పెద్దాస్పత్రిలో ఆధునికీకరించిన ఫిజియోథెరపీ విభాగాన్ని శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. దాతల సహకారం మరువలేనిదన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులను కలుపుకొని రోగులకు మంచి వసతులను కల్పించాలని సూచించారు. రోగుల కోసం దాతలు దువ్వూరి సాయికృష్ణ, గైనకాలజీ హెచ్‌ఓడీ గీతాదేవి, డాక్టర్ హాజిలియాస్, జేవీఆర్ షాపింగ్ మాల్ నుంచి మురళి, డాక్టర్ అశోక్, ల్యాబ్ టెక్నీషియన్ సాయితేజ, నోవా బ్లడ్‌బ్యాంక్ నుంచి అనిల్‌కుమార్, బయోమెడికల్ ఇంజినీర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ దువ్వూరు నారాయణరెడ్డి తదితరులు తమ వంతుగా ఫిజియోథెరపీ యంత్రాలను అందజేశారు.

వార్డుల్లో తనిఖీ

ఆస్పత్రిలోని ప్రసూతి వార్డు, చిన్నపిల్లల విభాగం, ఏఆర్టీ సెంటర్ తదితర వార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్యసేవలపై రోగులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందిన రోగులతో పాటు, ఓపీ వివరాలను పరిశీలించారు. పేయింగ్ రూమ్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గైనకాలజీ విభాగం వద్ద మొక్కలు నాటారు. డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, ఏఓ కళారాణి, హెచ్‌డీఎస్ కమిటీ కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, సభ్యులు బ్రహ్మానందరెడ్డి, మొగరాల సురేష్, మల్లికార్జున, అబీదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరల్ పోస్టులకు 22న రాత పరీక్ష

నెల్లూరు (టౌన్): సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు ఫతేఖాన్‌పేటలోని మున్సిపల్ స్కూల్లో రాత పరీక్షను ఈ నెల 22న నిర్వహించనున్నామని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎల్ఎస్‌సీఓ పోస్టులకు ఉదయం తొమ్మిది నుంచి 11 వరకు.. ఎంఐఎస్, ప్లానింగ్ కోఆర్డినేటర్ పోస్టులకు మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు.. అసిస్టెంట్ స్టాటిస్టికల్ పోస్టుకు మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు వరకు పరీక్షను నిర్వహించనున్నామని వివరించారు.